సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 1 । జనవరి । 2024





హ్యాపీ న్యూ ఇయర్

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక కుర్రకారు ఒక్కసారిగా టపాసులు పేల్చి, కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. 2023కు వీడ్కోలు పలుకుతూ 2024కు స్వాగతం చెబుతూ సంబురాలు చేసుకున్నారు. వేడుకలు శ్రుతి మించకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



న్యూస్‌రీల్

రైల్వే జీఎంకు ఫిర్యాదు



రైల్వేస్టేషన్‌లో దుస్థితి ఇది..

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్‌లోని పబ్లిక్ టాయిలెట్స్ కాంప్లెక్స్‌లో పరిసరాలు అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉన్నాయని, దుర్వాసనతో ప్లాట్‌ఫామ్స్‌పై ఉండలేకపోతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందారు. ఈ విషయమై గోదావరిఖనికి చెందిన ఫైట్ ఫర్ బెస్ట్ సొసైటీ సంస్థ ప్రతినిధి మద్దెల దినేశ్ ఇటీవల జీఎం వెబ్‌సైట్‌కు టాయిలెట్స్ ఫొటోలు జతపరిచి ఫిర్యాదుచేశారు. ప్రజల ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదు చేశారు.

అక్షరమే కవికి ఆయుధం



మాట్లాడుతున్న కవి ఏలేశ్వరం వెంకటేశ్

కోల్‌సిటీ(రామగుండం): అక్షరమే కవికి ఆయుధమని ప్రముఖ కవులు అన్నారు. గోదావరిఖని మార్కండేయకాలనీలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాహితీ సభ నిర్వహించారు. ప్రముఖ కవి వేల్పుల నారాయణ, స్నేహ సాహితీ అధ్యక్షుడు ఏలేశ్వరం వెంకటేశ్ మాట్లాడారు. అక్షరానికి పదును పెట్టుకుంటూ సమాజంలోని అన్యాయం అంతమయ్యేలా కవి అక్షర ఆయుధాన్ని ప్రయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గులాబీల మల్లారెడ్డి రచించిన 'ఎద్దు ఎవుసం.. సురుకుల వైద్యం' పుస్తకాన్ని కవి మేజిక్ రాజా సమీక్షించారు. మరో కవి కూచన మల్లయ్య మహర్షి తన కవితా గానం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు ప్రకాశ్‌రెడ్డి, పోచయ్య, శ్రీదాస్యం లక్ష్మయ్య, రాకుమార, పుట్ట రాజయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్నాలు వేసి, బోనం మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సివిక్ జోన్ కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోలేదన్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మధునమ్మ, రాజేశ్వరి, నాగరాజు, లింగయ్య, ప్రకాశ్, వాణి, స్వామి, నరేశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేడుకలు



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని పవర్ హౌస్‌కాలనీలోని ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో ఆదివారం ముందస్తు న్యూఇయర్ వేడుకలు జరుపుకున్నారు. కేక్‌ను లైబ్రేరియన్ ఎం.భారతి కేక్ కట్ చేసి పాఠకులకు మిఠాయిలు పంపిణీ చేశారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త సంవత్సరం పాఠకులకు మంచి జరగాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలని ఆకాంక్షించారు.

యువతా.. మీదే భవిత

- కొత్త సంవత్సరం కావాలి నవ నూతనం
- ప్రథమస్థానం.. ఉత్తమ గమ్యాలే లక్ష్యం
- వ్యాయామమే మహా ఆరోగ్యం
- అవినీతి అంతం.. అదే మన పంతం



కరీంనగర్ అర్బన్: వేడుకగా 2023 సంవత్సరానికి ముగింపు పలుకుతూ.. కొంగొత్త ఆశలతో 2024లోకి అడుగిడాం. గడిచిన ఏడాది పలువురికి విజయాన్ని అందించగా.. మరికొంతమందికి అపజయాలు మిగిల్చింది. వ్యవసాయం పండగని కొందరు యువత నిరూపించగా రాజకీయాల్లో ఎందుకు రాణించలేమంటూ మరికొందరు ఉత్సాహం చూపుతున్నారు. కొలువుల్లో దూకుడు తగ్గని యువత, విద్యాహబ్‌గా పేరున్న కరీంనగర్ పేరు నిలబెడతామని విద్యార్థిలోకం ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో అపజయాలను లెక్క చేయక.. విజయానందాన్ని గర్వించకుండా ముందుకు వెళ్లాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. జ్ఞాపకాలు పదిలం చేసుకొని.. లక్ష్యాలు సాకారం చేసుకొని.. గతేడాదికి వీడ్కోలు చెబుతూ..సరికొత్తగా సాగాల్సిన తరుణమిది. దేశ జనాభాలో అత్యధిక భాగం యువతే కావడం విశేషం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ వారిదే సింహభాగం.

ప్రథమ స్థానమే లక్ష్యం

చేసేవృత్తి, ఎంచుకున్న రంగం, ఉద్యోగం, విద్యార్థి.. యజమాని, శ్రామికుడు.. నాయకుడు, కార్యకర్త ఏదైనా సరే. అందరిలో ఒకటే లక్ష్యం కావాలి. అది ప్రథమస్థానంలో నిలవడం. చేసే పనిలో మనమే ప్రథమంగా నిలవాలనే తపనతో ముందుకు సాగితే విజయం వీడకుండా అంటిపెట్టుకుని ఉంటుంది. అందుకు వర్తమాన అంశాలు, సమాజ స్థితిగతులు, మానవ జీవన విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి.

ఉత్తమ గమ్యాలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే. స్వచ్ఛ భారత్ స్ఫూర్తిగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. కరీంనగర్ స్మార్ట్‌సిటీ నేపథ్యంలో ప్రజల పాత్ర కీలకం. నగరంలో రోజుకు 220 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఇందులో ప్లాస్టిక్ అత్యధికం. ఇదే కొనసాగితే పర్యావరణం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఆచరించడం ఉత్తమం.

వ్యాయామమే మహారోగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం మాట నవనూతనం. ఆరోగ్యకరమైన యువత దేశానికి అవసరం. అందుకే [illegible] శైలిలో మార్పులు అత్యవసరం. శారీరక శ్రమ లోపించడంతో ఊబకాయం, బుద్ధిమాంద్యం తలెత్తుతోంది. అమెరికా వంటి దేశాల్లో యువత శరీర బరువు తగ్గేలా నిరంతరం వ్యాయామం చేస్తుంటారు. శారీరక శ్రమ లేకపోతే మానసిక ఆందోళన పెరుగుతుంది. ఉదయం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవడం అనివార్యం. సమయానికి తిండి, నిద్ర ప్రాధాన్యం తెలుసుకుంటే ఉదయం వేళ హుషారు, మానసిక ఉత్తేజం తప్పకుండా లభిస్తుంది.

స్మార్ట్‌గా వ్యవహరిద్దాం

సెల్‌ఫోన్.. ప్రతి వ్యక్తి జీవితంలో కీలకం. మనిషికి సేవ చేసేందుకు వచ్చి శాసిస్తోంది. స్మార్ట్‌ఫోన్‌కు బానిస కాకుండా బాధ్యతగా వినియోగించాలి. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు, పుకార్లకు దూరంగా వ్యవహరించాలి. అంతేకాదు చిన్నారులు, యువత సెల్‌ఫోన్‌లో గేమ్‌లకు వ్యసనపరులు కాకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది.

క్షేమంగా గమ్యం

విలువైన ప్రాణం ప్రమాదంలో పోరాదు. అతివేగం.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్.. వేకువజామున ప్రయాణం.. వీటికి తోడు హెల్మెట్ లేకుండా వాహనం నడపొద్దని ప్రతిజ్ఞ చేసుకోవాలి. గతేడాది ఉమ్మడి జిల్లాలో 200మందికి పైగా మరణించగా 500లకు పైగా గాయపడ్డారు. ఈ సంఘటనలు మనకు ప్రయాణ పాఠం బోధిస్తున్నాయి. జాగ్రత్తగా వ్యవహరిస్తూ క్షేమంగా గమ్యం చేరాలి.

అవినీతి అంతం.. అదే మన పంతం

దేశ ప్రగతికి అవినీతి పెద్ద జాడ్యం. జిల్లాలో ప్రతిఏటా పదుల సంఖ్యలో అవినీతి నిరోధక శాఖ కేసులు నమోదు చేస్తోంది. అవినీతి అధికారులు, ఉద్యోగుల భరతం పట్టాలి. అప్పుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను స్వేచ్ఛగా పొందే అవకాశముంటుంది.

మానవత్వ పరిమళం

మనిషిగా జీవించాలి. స్వార్థం మానవ ఆలోచన వీడాలి. జీవితం నేరపూరితం కారాదు. ఆలోచన విధానం మారాలి. మనతోపాటు పిల్లల్లో చెడు ఆలోచనలకు చోటివ్వకుండా కావాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే మనసంతా మానవత్వమే. గతంలో 21హత్యలు, 34అత్యాచార సంఘటనలు చోటుచేసుకున్నాయి. దోపిడీ, మోసాల సంఖ్య చెప్పలేనంతగా నమోదు.. ఇది మనిషి జీవితానికి మచ్చగా పరిగణించాల్సిందే.

ఉపాధికి ఊతం

యువత అత్యధికంగా ఉండటమే కాదు నిరుద్యోగం ఎక్కువే. 2లక్షలకు పైగా ఉద్యోగాల కోసం వేచిచూస్తుంటే.. అర్హతకు తగిన పని లేక దొరికిన దాంతో అసంతృప్తితో కాలం వెళ్లదీస్తున్నారు. పారిశ్రామిక రంగం విస్తరిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఐటీ హబ్‌గా జిల్లాను మరింత తీర్చిదిద్దాల్సిన అవసరముంది.


ఆత్మహత్య వద్దే వద్దు

ఆత్మహత్య చేసుకునే ధైర్యం ఉంటే ఎంతటి కష్టమైన ఎదుర్కొవచ్చని చెబుతారు. అలాంటప్పుడు ఆ ఆలోచన వద్దు. గత సంవత్సరం వివిధ కారణాలతో 112 మంది ఆత్మహత్యకు పాల్పడటం విచారకరం. ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం దొరకవచ్చు.

బద్ధకాన్ని జయిద్దాం

ఆ పనా.. వామ్మో నాతో కాదు. ఇది మరీ కష్టంలే. అనే మాటలు వద్దు. అనుకుంటే సాధించలేనిది ఏముంది. చరిత్రను చూస్తే ఎన్నో విజయగాథలు.. పని వాయిదా వేసే దోరణిలో అమూల్యమైన అవకాశాలను చేజార్చుకోవడం చూస్తుంటాం. బద్ధకం వీడితే ఉజ్వల భవిత సొంతం అవుతుందనే ఆశాభావంతో ముందుకెళ్తే తప్పకుండా కొత్త మార్గం కనిపిస్తుంది.

జిల్లాల వారీగా యువత సంఖ్య	
కరీంనగర్	3,54,086
రాజన్న సిరిసిల్ల	2,08,422
పెద్దపల్లి	2,25,098
జగిత్యాల	2,34,765



సరి 'కొత్తగా' సాగుతాం

- కోటి ఆశలతో 2024లోకి..
- ప్రజలకు సుపరిపాలన చేరువ లక్ష్యం



సాక్షి, పెద్దపల్లి: జిల్లావాసులు గతం మరిచి కోటి ఆశలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టారు. 2023 మిగిల్చిన చేదు అనుభవాలను పక్కన పెట్టి.. నూతన వసంతాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఈఏడాది అందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. అనేక ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నందున అవన్నీ నెరవేరాలని కోరుకున్నారు. తాము చేపట్టే పనులు, తీసుకున్న నిర్ణయాలు, లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే..

ప్రజలకు పథకాల ప్రయోజనాలు



ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు చేరువ చేస్తాం. ప్రభుత్వ ప్రాధాన్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఆరు గ్యారెంటీల పథకాలకు అర్హులైన ప్రతీఒక్కరు దరఖాస్తు చేసుకోవాలి. ప్రధానంగా జిల్లాలో విద్య, వైద్యం మరింత మెరుగుపరిచేలా చొరవ తీసుకుంటాం. పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, స్వచ్ఛత పనులు పకడ్బందీగా నిర్వహిస్తాం.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

ప్రగతిని పరుగులు పెట్టిస్తాం



అధికారుల సహాయ సహకారాలతో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించుకున్నాం. ఇలాగే త్వరలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహిస్తాం. గ్రామ పంచాయతీలు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డులు సాధించాయి. వచ్చే ఏడాదిలో సైతం అవార్డులు సాధించడంలో ముందుండేలా చర్యలు తీసుకుంటాం. స్థానిక సంస్థలపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తాం. ప్రగతిని పరుగులు పెట్టిస్తాం.

– అరుణశ్రీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

అందరికీ అభివృద్ధి ఫలాలు



కొత్తప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషిచేస్తాం. అభివృద్ధి పనులను వేగవంతంచేసి సకాలంలో పూర్తియ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా పెండింగ్‌లోని భూసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటాం. ప్రాజెక్టులకు కావలసిన భూసేకరణ చేసి పనులు వేగవంతం చేస్తాం.

– శ్యాంలాల్ ప్రసాద్, అదనపు కలెక్టర్

మహిళల భద్రతకు పెద్దపీట



మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం. మహిళలు, పిల్లలపై దాడుల అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. 2024లో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపడతాం. ప్రతీఇంట్లో, ప్రతీగ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. వాటితో నేరాల విచారణ ఎంతో సులభమవుతుంది. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ చేతన, డీసీపీ, పెద్దపల్లి

సైబర్‌నేరాలపై దృష్టి సారిస్తాం

- పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగుతాం
- డ్రగ్స్ రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దుతాం
- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



గోదావరిఖని: కొత్త సంవత్సరం – 2024లో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగి నేర రహిత సమాజంగా తీర్చిదిద్దుతామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు పెద్ద సంఖ్యలో పెరిగాయన్నారు. వీటిపై ప్రతీరోజు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. 2024– కొత్త ఏడాదిలో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పట్టణం నుంచి గ్రామ స్థాయి వరకు సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్నికల బిజీలో ఇప్పటివరకు సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదని తెలిపారు. ఇకనుంచి సైబర్ నేరగాళ్ల ఆటకట్టించడంతోపాటు, ప్రజల్లో సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈఏడాదిలో డ్రగ్స్ రహిత పోలీస్ కమిషనరేట్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని, ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండి ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. పాజిటివ్ కోణంలో స్పందిస్తూ ముందుకు సాగుతామని సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు.

'గుర్తింపు' ముందు అనేక సవాళ్లు

- పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ మాఫీ
- కార్మికుల సొంతింటి కల నిజం చేయడం
- మారుపేర్ల సవరణ సమస్యకు పరిష్కారం
- అన్నీ సాధిస్తాం – సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు



విజయోత్సవంలో ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. సంస్థలో ఏడోసారి జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీపై 1,983 ఓట్ల మెజారిటీతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన పోరులో చివరకు విజయాన్ని కైవసం చేసుకుంది. సంస్థ వ్యాప్తంగా ఆరు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ, ఐదు ఏరియాల్లో ఏఐటీయూసీ గెలిచాయి. ఈక్రమంలో ప్రధాన డిమాండ్ల సాధన బాధ్యత గెలిచిన యూనియన్‌పై సవాల్ విసురుతోంది. సొంతింటి పథకం, మారుపేర్ల మార్పు, నూతన భూగర్భగనుల తవ్వకం తదితర డిమాండ్ల సాధన అంతసులువు కానప్పటికీ.. పోరాటాల చరిత్ర కలిగిన గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ భవిష్యత్‌లో ఎలా ముందుకు సాగుతుందోనని సింగరేణి కార్మికులను ఆలోచింపజేస్తోంది.

ఏఐటీయూసీ ఎన్నికల మెనిఫెస్టో ఇదీ..

- సింగరేణిలో రాజకీయ జోక్యం నియంత్రిస్తాం
- ఆర్థిక దుబారాను అరికడతాం
- కోలిండియా మాదిరిగా పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ మాఫీ చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ వస్తోంది.
- కార్మికుల పిల్లల ఉద్యోగ వయోపరిమితి 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంచుతాం.
- సొంతింటి పథకం కింద 250గజాల ఇంటి స్థలం, రూ.20లక్షల వడ్డీలేని రుణం మంజూరు చేయిస్తాం.
- నూతన భూగర్భగనులు తవ్వించి ఉద్యోగాలు పెంచడం
- బొగ్గు వెలికితీసే ప్రాంతాల్లో కాంట్రాక్టు కార్మికులను తొలగించి పర్మినెంట్ కార్మికులను నియమించడం.
- మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్లు, ఈపీ ఆపరేటర్లకు సర్ఫేస్‌లో అదే హోదా కల్పన.
- ప్లేడే, పీహెచ్‌డీలకు ఎన్–వన్ విధానం తొలగించి పాత పద్ధతి కొనసాగిస్తాం.
- మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు డబ్బులు లేకుండా అందరికీ అన్‌ఫిట్ చేయిస్తాం
- సంస్థ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు మెరుగుపర్చి సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించేలా కృషి చేస్తాం.
- సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ విద్యా బోధన అందుబాటులోకి తెస్తాం.
- సీహెచ్‌పీల్లో పనిచేసే కార్మికులకు డస్ట్ అలవెన్స్ ఇప్పిస్తాం.
- రిటైర్డ్ రోజునే కార్మికులకు టర్మినల్ బెనిఫిట్స్ అందేలా చూస్తాం.
- చదువుకున్న కార్మికులకు సూటబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తాం.
- మహిళా కార్మికులను భూగర్భగనుల్లోకి దింపకుండా చూస్తాం.
- అన్నిఏరియాల్లో కార్మికులకు డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇచ్చేలా చూస్తాం.
- క్యాంటీన్లలో నాణ్యమైన టిఫిన్స్ అందించేలా చూస్తాం.
- గని ప్రమాదాల్లో ఇంక్రిమెంట్లు కోల్పోయిన వారికి వన్‌టైం సెటిల్‌మెంట్‌కింద ఇంక్రిమెంట్ ఇప్పిస్తాం.
- తెలంగాణ ఇంక్రిమెంట్ బేసిక్‌లో కల్పించేలా చూస్తాం.
- సింగరేణి డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్ నిధులు సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేసేలా చూస్తాం.
- మారుపేర్ల కార్మికులను సొంత పేర్లపై రెగ్యులరైజ్ చేసేలా చూస్తాం.
- 2022లో జరిగిన 9డిమాండ్ల ఒప్పందం అమలయ్యేలా చూస్తాం.

కార్మికుల పక్షాన పోరు



మాపై నమ్మకంలో ఎన్నికల్లో గుర్తింపు యూనియన్‌గా గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు. వారి పక్షాన నిలబడి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీహామీని నెరవేర్చుతాం. పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ మాఫీ, సొంతింటి కల నెరవేర్చుతాం. మారుపేర్లతో నిలిచిపోయిన డిపెండెంట్ ఉద్యోగాలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద క్లియర్ చేసేలా చూస్తాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేలా దృష్టి సారిస్తాం.

– సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

క్లుప్తంగా

రేగొండలో ప్రమాదం.. వెన్నంపల్లిలో విషాదం


ప్రేమ్‌కుమార్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ప్రేమ్‌కుమార్(26) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రేమ్‌కుమార్ కరీంనగర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు భాగ్యమ్మ, బక్కయ్య. చిన్న కుమారుడు ప్రేమ్‌కుమార్ మృతితో తల్లి దండ్రుల రోదనలు మిన్నంటాయి. ఎదిగిన కొడుకు వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తుండగా.. రోడ్డు ప్రమాదం ప్రాణాలుతీ స్తుందనుకోలేదని కన్నీరుమున్నీరయ్యారు. 2023కు వీడ్కోలు పలుకుతూ.. 2024కు స్వాగతం చెప్పేందుకు సిద్ధమైన ప్రేమ్‌కుమార్.. కానరాని లోకాలకు వెళ్లడంతో ఫ్రెండ్స్ బావురుమన్నారు.

కరోనా కలకలం

- అప్రమత్తమైన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాట్లు
- అందుబాటులో 460బెడ్లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కరోనా వైరస్ కలవరపెడుతోంది. కొత్తరకం వేరియంట్ పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనికి చెందిన ముగ్గురికి సోకిందనే సమాచారం కలకలం రేపింది. దీంతో జిల్లాలో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. అయితే జనసందోహం ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నా.. ఎవరూ ఆచరించడం లేదు. దాదాపు మూడేళ్ల క్రితం ప్రజలను కలవరపెట్టిన కరోనా నేర్పిన పాఠాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కరోనాను కట్టడి చేసేందుకు సర్వసన్నద్ధమయ్యారు.

బస్సుల్లో పెరిగిన రద్దీ..

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. జనం రద్దీ అధికంగా ఉన్నా కరోనా వైరస్‌ను కట్టడ చేసేందుకు వీలుగా మాస్కులు ధరించే వారిని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ప్రయాణాన్ని ఉచితం చేయడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని ఆర్టీసీ అధికారుల లెక్కలే చెబుతున్నాయి. అయితే పొంచిఉన్న కరోనాను కట్టడి చేసేందుకు ప్రజలు మాస్కులు ధరించి అప్రమత్తం కావాలని అధికారులు కోరుతున్నారు.



పర్యవేక్షిస్తున్న కేంద్ర మంత్రిత్వశాఖ

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికారులు జిల్లా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. కరోనా ప్రబలితే కట్టడికి తీసుకునే చర్యలపై ఆరా తీస్తున్నారు. కరోనాను కట్టడి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగేలా మాక్‌డ్రిల్ తదితర కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తూ చైతన్యపరుస్తున్నారు.

460 పడకలు సిద్ధం..

జిల్లాలో కరోనా కోరలు చాస్తే ఆ వైరస్ బారినపడ్డ వారిని కాపాడేందుకు వీలుగా జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ ఆస్పత్రుల్లో 460 పడకలను సిద్ధం చేశారు. రామగుండం(గోదావరిఖని)లో అత్యధికంగా 330 పడకలు సిద్ధం చేసిన వైద్యాధికారులు.. పెద్దపల్లిలోని జిల్లా ఆస్పత్రిలో 50 పడకలు, మంథనిలో 50పడకలు, సుల్తానాబాద్‌లో 30 పడకలు అందుబాటులోకి తెచ్చామని అధికారవర్గాలు తెలిపాయి.

స్వీయరక్షణ పాటిస్తే మేలు..

కరోనా కొత్త రకం వేరియంట్ జేఎస్–1ను కట్టడి చేసేందుకు ప్రజలు తమకు తామే స్వీయరక్షణ పాటించడం మేలని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యసేవలను పొందాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాలకు వెళ్తే మాస్క్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ రమాకాంత్ సూచించారు. కోవిడ్ నియంత్రణకు అవసరమైన అన్ని వైద్యసేవలను అందించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని, ప్రజలెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని వివరించారు.

జిల్లా సమాచారం

అందుబాటులో బెడ్లు	460
పారా మెడికల్ సిబ్బంది	359
పీపీఈ కిట్లు	600
ఆక్సీమీటర్లు	183
ఆక్సిజన్ సిలిండర్లు	558
ఆక్సిజన్‌ప్లాంట్లు	04
నెబ్‌లైజర్లు	57
వెంటిలేటర్లు	22
ప్రభుత్వ ఆస్పత్రులు	03
పీహెచ్‌సీలు	24

'ఖని'లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



గోదావరిఖని: నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతులు దొర్లకుండా పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. గోదావరిఖనిలోని పలుప్రాంతాల్లో ఆదివారం రాత్రి పెట్రోలింగ్ తీవ్రతరం చేసింది. మొబైల్ పెట్రోలింగ్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టింది. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసులు నగరమంతా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను బ్రీతింగ్ ఎనలైజర్‌తో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే



పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్నకొండ మల్లమ్మ అనే వృద్ధురాలిని ఎమ్మెల్యే విజయరమణారావు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలికి మెరుగైన వైద్యసేవలను అందించాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి(మంథని): రత్నాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కెర లక్ష్మణ్ గౌడ్(50) తాటి చెట్టు పైనుంచి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. కులవృత్తిలో భాగంగా ఆదివారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. మోకు జారికింద పడటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు. కాగా, ప్రభుత్వ పరంగా బాధితుడిని ఆదుకోవాలని సర్పంచ్ పల్లె ప్రతిమ, ఎంపీటీసీ దర్ముల రాజసంపత్, ఉప సర్పంచ్ దుబ్బాక సత్యారెడ్డి, గౌడ సంఘం నాయకులు ముక్కెర సతీశ్ గౌడ్, కెక్కర్ల సమ్మయ్యగౌడ్ తదితరులు కోరారు.

వానరానికి వర్ధంతి

జూలపల్లి(పెద్దపల్లి): హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాలో నెలకొల్పిన వానర విగ్రహానికి ఐదో వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఐదేళ్ల క్రితం ఇక్కడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుదాఘాతంతో కోతి మృత్యువాత పడింది. హనుమంతునికి ప్రతిరూపంగా భావించిన హమాలీలు.. కార్మిక సంఘం ఆధ్వర్యంలో చందాలు వేసుకుని వానర విగ్రహం ఏర్పాటు చేశారు. ఈమేరకు ఆదివారం వర్ధంతి జరిపారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, గ్రామస్తులు కొడూరి రాజేశ్వర్, కొంజెర్ల శ్రీనివాస్, బండి స్వామి, సభ్యులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు







ఆధార్ అవస్థలు


పెద్దపల్లిలోని ఓ ఆధార్ కేంద్రంలో ప్రజల రద్దీ



నా కొడుకు సాయిచరణ్‌కు ఆధార్ వివరాలు నమోదు చేసేందుకు పెద్దపల్లిలోని ఆధార్ నమోదు సెంటర్ల చుట్టూ ఐదారురోజులుగా తిరుగుతున్న. బీఎస్ఎన్ఎల్ ఆఫీసుకు పోతే 30మందికి టోకెన్లు ఇచ్చినం.. వేరే సెంటర్‌కు పొమ్మన్నరు.


– పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన బూరం శ్యామల ఆవేదన



నా మనవడి ఆధార్ వివరాలు నమోదు చేసేందుకు వచ్చినం. ఇక్కడికి చాలామంది వస్తుండ్రు. ఫొటోలు తీసే సెంటర్లు కొన్నే ఉన్నయి.. చానా తిప్పలైతంది. సర్కార్ ఇంకాకొన్ని ఏర్పాటు జేయాలె. ఇబ్బందులు దూరం జేయాలె.

– పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన జంగిలి పోచమ్మ సూచన

- సంక్షేమ పథకాలకు అప్‌డేట్ తప్పనిసరి
- అర్ధరాత్రి నుంచే ఆధార్ కేంద్రాల వద్ద బారులు
- పెరుగుతున్న రద్దీ.. ఘర్షణలతో సెంటర్ల మూత
- కొన్ని 30మందికే టోకెన్లు జారీ!



ఆధార్ సేవలు లేవంటూ మీసేవ కేంద్రం ఎదుట బోర్డు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటికీ ఆధార్ నంబరు ఆధారం కావడంతో దానిని అప్‌డేట్ చేసుకునేందుకు, కొత్తగా వివరాలు నమోదు చేసుకునేందుకు జిల్లావాసులు నానాతిప్పలు పడుతున్నారు. జిల్లాలో 23 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయి. అందులో జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలోనే 8 ఉండగా.. వివిధ కారణాలు చూపుతూ వాటిలో నాలుగింటిని అధికారులు మూసివేయించారు. పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన కేంద్రం కూడా సాంకేతిక కారణంతో మూతపడింది. మిగిలింది బీఎస్ఎన్ఎల్ కార్యాలయంతోపాటు ఓరియంట్, యూనియన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లోని ఆధార్ వివరాల నమోదు కేంద్రాలే అందుబాటులో ఉన్నాయి.

రోజూ 30టోకెన్లు జారీ

ఆధార్ నమోదు కేంద్రాలకు ఇప్పుడు ప్రజలు పోటెత్తుతున్నారు. దీంతో రోజూ కేవలం 30మందికే టోకెన్లు జారీ చేస్తున్నారు నిర్వాహకులు. ఆ టోకెన్ల కోసం ప్రజలు ఘర్షణ పడుతున్నారు. దీంతో బ్యాంకుల్లో ఆధార్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో సమస్య ఇంకా తీవ్రమైంది. టోకెన్లు ఎలాగైనా దక్కించుకోవాలన్న ఆరాటంతో పల్లెప్రాంతాల ప్రజలు అర్ధరాత్రి నుంచే ఆధార్ సెంటర్ల ఎదుట బారులు తీరుతున్నారు.

ఆధార్ సెంటర్ లేదు..

- మా వద్ద ఆధార్ సెంటర్ లేదు.. అని మీసేవా కేంద్రాల ఎదుట నిర్వాహకులు బోర్డులు పెడుతున్నారు.
- ఆధార్ కేంద్రాల వద్ద జనం తాకిడి ఎక్కువగా ఉండడం.. టోకెన్లు దక్కక పోవడంతో ప్రజలు మీసేవా కేంద్రాల వైపు మళ్లుతున్నారు.
- మీసేవల్లో ఆధార్ వివరాలు నమోదు చేస్తారేమోననే ఆశతో వచ్చిన ప్రజలు ఆ బోర్డులను చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు.
- అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్‌తో లింగకు పెట్టిన అధికారులు, పాలకులు.. వాటిని జారీచేసేందుకు అవసరమైనన్ని కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- పెద్దపల్లిలో వివిధ కారణాలతో మూసివేయించిన ఆధార్ సెంటర్లను ప్రత్యేక నిబంధనలతోనైనా తిరిగి తెరిపిస్తే ప్రజలకు సేవలందే అవకాశముంటుందని పేర్కొంటున్నారు.
- ఆధార్ కేంద్రాలను తాత్కాలికంగా గ్రామాల్లో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఇబ్బందులను దూరం చేయాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

'నూతన' ఆశలతో..

- కొత్త ఏడాదిలో సరికొత్త లక్ష్యాలు
- జిల్లావాసుల ఆలోచనలు

సాక్షి, పెద్దపల్లి: కొత్త సంవత్సరం–2024లో గతాన్ని త్యజించి కొంగొత్త ఆశలతో లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధనకు ప్రయత్నిస్తాం. నూతన సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను నిరంతర సాధన, కఠోర శ్రమతో సాధిస్తామని జిల్లాలోని పలువురు ప్రముఖులు, యువతులు అంటున్నారు. వారి మనోగతం వారి మాటల్లోనే..

ఉద్యోగ సాధనే లక్ష్యం



కొత్త సంవత్సరంలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నా. అందుకు అనుగుణంగా శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న. ఇప్పటికే కొన్ని పరీక్షలకు హాజరయ్యా. వాటి ఫలితాలు రావాల్సి ఉంది. కచ్చితంగా ఉద్యోగం సాధిస్తానని నమ్మకం ఉంది.

– పుల్లూరి అరవింద్, అందుగులపల్లి

వెండితెరపై కనిపించాలి



23 సంవత్సరంలోకి అడుగు పెట్టి ముందు తీసుకున్న నిర్ణయాలు దాదాపు అమలు చేశా. అందరూ మెచ్చుకునేలా నా అభినయంతో జనాల అభిమానం పొందాలనుకున్న. అనుకున్న దానికంటే అభిమానులకు ఎక్కువగా దగ్గరయ్యాను. 2024లో కచ్చితంగా వెండితెరపై కనిపించాలనేదే నా ఆశయం.

– వర్షిణి, యూట్యూబ్ స్టార్, గోదావరిఖని

అక్షరజ్ఞానం పెంచాలి



సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులకు ఫలాలు అందేలా చూడటం నా మెయిన్ జాబ్. ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్స్ ప్రమోట్ చేయాలనుకుంటున్న. యువతకు జాబ్స్ అండ్ కెరీర్‌పై అవగాహన కల్పించడం చాలా ఇంట్రెస్ట్. నేను టీచింగ్ ప్రొఫెషన్ నుంచి వచ్చా. మురికివాడల్లో ఉండే మహిళలు నిరక్షరాస్యులు. వారు కనీసం చదవడం, సంతకం చేయడం నేర్చుకునేలా చర్యలు తీసుకుంటా.

– రజని, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్

జాబ్ కొట్టడం లక్ష్యం



గతేడాది ప్రభుత్వ నోటిఫికేషన్లు రాలేదు. సంవత్సరాలు గడుస్తున్నా నోటిఫికేషన్లు రావడం లేదు. ఈఏడాదైనా నోటిఫికేషన్లు విడుదలచేస్తే కచ్చితంగా జాబ్ కొట్టి జీవితంలో సెటిల్ అవ్వాలి. ఈ ఏడాదిలోనైనా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగాలని కోరుకుంటున్నా. కొత్త ప్రభుత్వం నూతన సంవత్సరంలో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు జారీచేస్తుందని నాతోపాటు నిరుద్యోగులు ఆశిస్తున్నారు.

– పొరండ్ల అనిల్, నిరుద్యోగి, జూలపల్లి

ప్రకృతి వైద్యం చేరువ చేస్తాం



గతేడాది రేకుర్తి కంటి ఆస్పత్రి సాయంతో దాదాపు 100 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశాం. ఉచితంగా అనేక వైద్య శిబిరాలు నిర్వహించాం. ఈఏడాది ప్రకృతి వైద్య ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాం. మందులు, ఆపరేషన్ అవసరం లేకుండా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాం. సింగరేణి కార్మికులు ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. యాజమాన్యం అవకాశం ఇస్తే ప్రకృతి వైద్యం ద్వారా వారికి సేవలు అందిస్తాం.

– శరణ్య, ప్రకృతి వైద్యనిపుణురాలు





